అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
బుధవారం 22 ఫిబ్రవరి 2023

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

నవతెలంగాణ దండేపల్లి

మండలంలోని వెలగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలోని 13 పాఠశాలలో విద్యార్థులకు రచనా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి మాట్లాడుతూ మాతృభాష, మాతృమూర్తి, మాతృదేశం పూజ్యనీయమని, తెలుగుపై అభిమానం కలిగి ఉండాలని అన్నారు. తెలుగు భాషపై రచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రావణవేణి రవీందర్, సిఆర్‌పి రమేష్, కాంప్లెక్స్ పరిధిలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కలెక్టర్‌గా విధుల్లో చేరిన తర్వాత మొట్టమొదటిసారి మంగళవారం బోర్కడే హేమంత్ సహదేవరావు జిల్లా జడ్జి రవీంద్ర శర్మను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



అగ్గి రాజుకుంటే..ఆపేదెలా..?

- ఉమ్మడి జిల్లాలో అరకొర కేంద్రాలతో అవస్థలు
- అగ్నిప్రమాదాల నివారణలో తీవ్ర జాప్యం
- కొత్త కేంద్రాల ప్రతిపాదనలపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఏటా సంభవించే ప్రమాదాలతో ప్రాణ, ఆస్తి నష్టం
- దృష్టిసారించని పాలకులు..పట్టించుకోని ప్రభుత్వం



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం ఇది. చుట్టుపక్కల జైనథ్, బేల, తాంసి, తలమడుగు, భీంపూర్ తదితర మండలాల్లో ప్రమాద నివారణ కోసం ఇక్కడ్నుంచే అగ్నిమాపక వాహనం వెళ్లాల్సి ఉంటుంది. ఆయా మండలాల్లోని మారుమూల పల్లెలు సుమారు 30 నుంచి 40కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మారుమూల పల్లెల్లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవిస్తే ఈ వాహనం అక్కడికి వెళ్లాలంటే సుమారు 45నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది. అప్పటి వరకు ప్రమాద తీవ్రత అధికమై అధిక నష్టం వాటిల్లుతోంది.



ఇచ్చోడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం ఇది. ఈ కేంద్రం పరిధిలో గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, సిరికొండ, ఇచ్చోడ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఎక్కడైనా పల్లెల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే ఈ వాహనం అక్కడికి వెళ్లే సరికి అధికంగా ఆస్థినష్టం జరుగుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రమాదం ఎప్పుడు ఏ క్షణంలో సంభవిస్తుందో తెలియదు. అకస్మాత్తుగా జరిగే ఈ ప్రమాదాలను నివారించడం ఒక్కటే మార్గం. కానీ ఉమ్మడి జిల్లాలో అరకొర అగ్నిమాపక కేంద్రాలు ఉండటంతో ప్రమాదాల నివారణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. జిల్లా విశాలంగా ఉండటం.. మారుమూల ప్రాంతాలు అధికంగా ఉండటంతో పాటు ఎక్కువగా అటవీ ప్రాంతం కావడంతో రోడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితి ఉంది. ముఖ్యంగా అనేక మారుమూల పల్లెలకు వెళ్లాలంటే ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో ఆయా ప్రాంతాల్లోని అగ్నిప్రమాక కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో ప్రమాదాల నివారణ సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఖానాపూర్, జన్నారం, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూర్‌లో మాత్రమే ఉన్నాయి. వాస్తవానికి 25కిలోమీటర్లకు ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదు. ఏటా ప్రమాదాలు జరగడం.. ప్రాణాలతో పాటు తీవ్రస్థాయిలో ఆస్థినష్టం సంభవించడం పరిపాటిగా మారుతోంది. నష్టాల తీవ్రతను తగ్గించేందుకు ఇప్పుడున్న కేంద్రాలు ఏ మాత్రం సరిపోవడం లేదని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త వాటికి లభించని మోక్షం..!

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 12 అగ్నిమాపక కేంద్రాలు ఉండగా వీటికి అదనంగా మరిన్ని కొత్తగా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. బేల, కెరమెరి తదితర చోట్ల ఏర్పాటుచేయాలని ప్రభుత్వానికి రెండేండ్ల కిందటే ప్రతిపాధించినా అక్కడ్నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఏదైనా ఆస్పత్రి, విద్యా సంస్థలు తదితర వాటిలో అగ్నిమాపక యంత్రాలు లేకుంటే అనుమతులు ఇవ్వని ప్రభుత్వం.. ప్రజల ఆస్తిని కాపాడేందుకు ఏర్పాటు చేయాలని కొత్త కేంద్రాల పట్ల మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా వేసవి రాగానే ఎక్కడో ఓ చోట అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు సంభవించడం ఆస్తి నష్టం కలగడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25కిలోమీటర్ల వ్యవధిలో ఒక కేంద్రం ఏర్పాటుచేస్తే ప్రమాదాన్ని పూర్తిగా తగ్గించకపోయినా.. అధిక ఆస్తి నష్టాన్ని నివారించేందుకు మాత్రం ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక కేంద్రం ఏర్పాటు చేయాలని వాహనంతో పాటు పదిమంది ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్లు, ఒక అధికారిని నియమించాల్సి ఉంటుంది. ఇది భారమవుతుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కొత్త కేంద్రాల ఏర్పాటుకు వెనుకడుగు వేస్తోందని తెలుస్తోంది. అరకొర కేంద్రాలతో పాటు సిబ్బంది కొరత కూడా ఆశాఖను వేధిస్తున్నట్లు సమాచారం. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. కొత్త కేంద్రాలు ఏర్పాటుచేయాలని ప్రతి ఏటా ప్రజల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం : కేశవులు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం అన్ని కేంద్రాల్లో వాహనాలు, సౌకర్యాలు ఉన్నాయి. కొత్త వాటి ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించాం. అక్కడ్నుంచి అనుమతి రాగానే ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటాం.

బోథ్ మండలంలో గతంలో పలుమార్లు అగ్నిప్రమాదాలు సంభవించడంతో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుచేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కిందటేడాది ఓ ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో ఆగ్రహం చెందిన ఆయా గ్రామాల ప్రజలు అగ్నిమాపక వాహనాన్ని అడ్డుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇక్కడ నూతనంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అనుమతివ్వడంతో అధికారులు స్థల సేకరణ పూర్తిచేశారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో కేంద్రం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇలా కొత్తగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందనే విమర్శలున్నాయి.

మార్కెట్‌లోకి కొత్త యాక్టివా హెచ్ స్మార్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పట్టణంలోని మహాలక్ష్మి హోండా షోరూమ్‌లో కొత్త యాక్టివా హెచ్ స్మార్ట్‌ను వివిధ ఫైనాన్స్ మేనేజర్స్ చేతుల మీదుగా మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్మార్ట్ కీతో కిక్ స్టార్ట్ లేకుండా కొత్త టెక్నాలజీతో కూడిన వాహనమని ప్రత్యేకతలను సేల్స్ మేనేజర్ సాయి కృపాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజింగ్ డైరెక్టర్ నల్ల నకుల్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

28న గోండి ధర్మగురువు హీరాసుక జయంతిని విజయవంతం చేయాలి



నవతెలంగాణ - జైనూర్

ఈ నెల 28న ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో రాంలీల మైదానంలో గోండి ధర్మగురువు హీరాసుక జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన్ సంఘం అధ్యక్షుడు దుర్వ నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొమురం భీం చౌరస్తా వద్ద జాతీయ స్థాయి గోండి ధర్మగురువు హీరాసుక జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గోండి సంస్కృతి గొప్పదన్నారు. జయంతికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బేల, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్ష సునీల్, గొడం లక్ష్మణ్, ఆత్రం నిఖిల్, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల నాయకులు కనక కృష్ణ, ఆత్రం శేషు, శాంతరాజ్, అనీల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని కమ్మర్‌గాం గ్రామ రైతువేదికలో ఆయిల్‌ఫామ్ సాగుపై వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజుల నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగుకు అనేక సబ్సిడీలను అందిస్తుందని, ఆసక్తి కలిగిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకుంటే వారి భూములను పరిశీలిస్తామన్నారు. అనంతరం గ్రామంలోని రైతుల యొక్క భూములను సర్పంచ్ మధునయ్యతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శాంతిప్రియ, ఏఈఓ శ్రీవిద్య, మ్యాట్రిక్స్ ఆయిల్‌ఫామ్ కంపెనీ సీఈఓ ఉదయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

ఉపాధి హామీ కూలీలు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. మిట్టపల్లి శివారుల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల నిర్వాహణను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరు శాతం తనిఖీ చేసిన ఆయన కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా పనులు కొనసాగించాలని సూచించారు. వేసవి ఎండలు ముదురుతున్నందున చల్లపూటనే పనుల్లోకి వెళ్లాలని తెలిపారు. రోజు వారి కూలీ రూ.257 గిట్టుబాటు అయ్యే విధంగా నిర్దేషిత కొలతల ప్రకారం గుంతలు తవ్వాలని కోరారు. మిట్టపల్లి చెరువులో మట్టి తీయడం సులువుగా ఉన్నందున 3 మీటర్ల పొడవు మీటరు వెడల్పు, ఆఫ్ మీటర్ లోతుతో కందకం తీస్తే కూలీ గిట్టుబాటు అవుతుందని సూచించారు. నూరు శాతం కూలీ గిట్టుబాటు అయ్యేందుకు కూలీలు పని చేయాలని కోరారు.

గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎలకపల్లి సాయిలు అనే గల్ఫ్ కార్మికుడు జనవరి 5న ఇరాక్‌లో గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబానికి మంగళవారం కిష్టాపూర్ గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రూ.16,500 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కిష్టాపూర్ గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి అధ్యక్షుడు, అంకం మహేష్ మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. 500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ నిధి ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగేష్, రాజన్న, బాపూరావు, కాంతారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు రావాలని ఇంటింటికి ప్రచారం

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్ర గ్రామ పంచాయతీ పరిధిలో గల రాంనగర్, అర్జుగూడ, లక్ష్మీనగర్, బండోకార్‌వాడలో ఈజీయస్ పనులకు రావాలని కోరుతూ ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఎం మోసిన్, పంచాయతీ కార్యదర్శి విలాస్, టీఏ శ్రావన్‌కుమార్ ఇంటింటికి తిరుగుతూ ఉపాధిహామీ పనులకు రావాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

23న వాహనాల వేలం

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 23న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ విలాస్ తెలిపారు. ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ వేలానికి ఆసిఫాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి బి జ్యోతి కిరణ్ హాజరు కానున్నారని, ఆసక్తి కలిగిన వారు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత ఉపాధి కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో రెడ్ బుక్ డే సందర్భంగా సామూహిక పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1848లో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక వెలువడిన రోజును పురస్కరించుకొని ఫిబ్రవరి 21ని ప్రతీ ఏటా ప్రపంచ వ్యాప్తంగా రెడ్ బుక్ డేగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ సహచరుడు శివవర్మ రాసిన భారత విప్లవ కెరటం భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు సామూహిక పఠనం చేశారు. భగత్‌సింగ్ రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వంతో కూడిన స్వతంత్రం కావాలని కోరుకున్నారన్నారు. కుల, మత ప్రాతిపదికన ప్రజలను విడదీసే కుటిల రాజకీయ నీతిని ఆయన ఎండగట్టారన్నారు. నేను నాస్తికుణ్ణి, విప్లవకారుణ్ణి అని గర్వంగా చెప్పుకున్న వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. పార్లమెంట్‌పై బాంబు దాడిచేసి తప్పించుకోవడానికి అవకాశమున్నా పిరికితనం ప్రదర్శించకుండా లొంగిపోయి కోర్టులను వేదికలుగా చేసుకొని దేశ ప్రజానీకానికి తన లక్ష్యాలను తెలియజేశారన్నారు. ఉరి కంబానికి ఊయలూగుతూ తన ప్రాణాలను తృణపాయంగా అర్పించిన యోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవులని తెలిపారు. తాను చనిపోయినా భావాలు సామ్రాజ్యవాదాన్ని, దోపిడీదారులను వెన్నాడుతూనే ఉంటాయని అని ప్రకటించిన ధీశాలి అని కొనియాడారు. నేటి పాలకులు ఆయన ఆశయాలను తుంగలో తొక్కి దోపిడీ పాలనకు తెరలేపారని, పేదలు దరిద్రులుగా మారుతుంటే కొంతమంది దగ్గర మాత్రమే దేశ సంపద పోగుబడుతోందని పేర్కొన్నారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కులం, మతం, ప్రాంతం ప్రాతిపదికన బ్రిటీష్ వారసత్వం పుణికిపుచ్చుకొని ప్రజలను విభజించి పాలించే పద్ధతిని అవలంబిస్తున్నారని మడిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అన్నమొళ్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, బైరి సోమేశ్, ఆర్.మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రుణమాఫీ సాధ్యం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్‌తోనే రుణమాఫీ సాధ్యమవుతుందని ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. ఆమె మంగళవారం మండలంలోని గిన్నెర, తోయగూడ, బొప్పాపూర్ తదితర గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో భరోసా కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం, రుణమాఫీ తదితర హామీలు నెరవేర్చలేదని తెలిపారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. రైతులకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వక పంటలు ఎండిపోతున్నాయన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు.

వరిలో పీక పురుగును నివారించాలి



నవతెలంగాణ-భీమారం

ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో వరి పైరులో పీక పురుగు ఆశించడానికి అనుకూల సమయమని సహాయ వ్యవసాయ సంచాలకులు బాపు తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్న వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీక పురుగు మొక్క ఎదిగే సమయంలో ఆశించచినట్లైతే మొక్క పూర్తిగా చనిపోతుందని, అదేవిధంగా పొట్ట దశలో ఆశిస్తే పంటకు దిగుబడిలో తీవ్ర నష్టం కలిగిస్తుందని వివరించారు. రైతు పంట సస్యరక్షణ చర్యల్లో భాగంగా వేసే ఎరువుల వాడకం దఫా దఫాల క్రమ పద్ధతిలో వేసుకోవాలని సూచించారు. పంటలో పీక పురుగు ఆశించిన ప్రారంభ దశలోనే గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరోఫైరిఫాస్ 50 ఈసీ 500 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటికి కలిపి పైరు తడిసే విధంగా పిచికారి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ విస్తరణాధికారి అరుణ్‌కుమార్, గ్రామ రైతులు ఉన్నారు.

వీఆర్‌ఏ కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ - వాంకిడి

రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన మండలకేంద్రానికి చెందిన వీఆర్‌ఏ ఉప్రె రమేష్ కుటుంబసభ్యులను మంగళవారం తహసీల్దార్ రెహీమొద్దీన్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం నుండి వచ్చే ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆర్థికంగా అన్ని సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ట్యాక్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

నవతెలంగాణ - బెజ్జూర్

రోడ్డు ట్యాక్స్ క్లియర్ లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని ఎంవీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ట్యాక్స్ లేకుండా నడుపుతున్న మూడు వాహనాలను పట్టుకున్నట్టు తెలిపారు. ట్రాక్టర్, వ్యాన్, బొలేరో ట్యాక్స్ లేకుండా నడిపినట్టు పేర్కొన్నారు. ట్యాక్సులు క్లియర్ చేయించామని, రోడ్డు ట్యాక్స్‌లు ఎప్పటికప్పుడు చెల్లించాలని, లేకుంటే భారీ జరిమానా విధించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే : సాజిద్‌ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డ్ కేఆర్కేలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. నాయకులకు ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాలనీలో మౌళిక వసతులు కల్పిస్తామని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు అందించి ప్రతి పేదవాడి మొహంలో చిరునవ్వులు పూయించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ప్రతి పేదవాడికి రూ.5లక్షల ఉచిత రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా ఇస్తామని తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత స్థాయి విద్యను అందిస్తామని, వెంటనే ఫీజు రీయిబర్స్‌మెంట్ అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ సంక్షేమ రాజ్యం వచ్చే విధంగా ఆశీర్వదించాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కాడే సంతోష్, పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్‌గౌడ్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంబ్లే శివాజీ, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు సంజయ్ దుటే, పట్టణ ఉపాధ్యక్షుడు సమీర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాదిక్, మాజీ పట్టణ అధ్యక్షుడు వసీం ఖాన్, మావల సీనియర్ నాయకులు గౌస్, రాజు, మాజీ ఎంపీటీసీ సంద నర్సింగ్, ఎస్సీ సెల్ నాయకులు కార్డే నాందేవ్, జిల్లా మహిళా నాయకులు తొడసం లక్ష్మీ బాయి, మాజీ ఎంపీటీసీ కవిత, యూత్ కాంగ్రెస్ నాయకులు ఫాహిమ్ పాల్గొన్నారు.



వీఆర్‌ఏల గోడు పట్టించుకోవాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి



నవతెలంగాణ - కౌటాల

ప్రభుత్వం వీఆర్‌ఏల గోడు పట్టించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు వీఆర్‌ఏలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హామీలిచ్చి ఏండ్లు గడిచినా కారుణ్య నియామకాలకు మోక్షం కలగలేదన్నారు. గతంలో సమ్మె చేస్తే సీఎస్ హామీతో విరమణ చేశామని, అది నేటికీ నెరవేరక వీఆర్‌ఏ కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో మగ్గుతున్నాయన్నారు. అప్పులు చేసిన వీఆర్‌ఏలు పిల్లల బడి ఫీజులు చెల్లించలేక పోతున్నారన్నారు. రెండేండ్ల కింద సీఎం కేసీఆర్ హామీలిచ్చి మరిచిపోయారని విమర్శించారు. కారుణ్య నియామకాలు చేపడుతామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23 వేల మంది వీఆర్‌ఏలు 80 రోజుల పాటు నిరవధిక సమ్మె చేపట్టారని, మునుగోడు ఉప ఎన్నిక సమయంలో గత్యంతరం లేక ప్రభుత్వం దిగొచ్చి ఎన్నికల కోడ్ ముగియగానే డిమాండ్లన్నీ తీర్చుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమకు సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మళ్లీ సమ్మె బాట పడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేసిన విధంగానే వీఆర్‌ఏలను సైతం వదిలించుకొనే యోచనలో ప్రభుత్వం ఆలోచిస్తోందని, దాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

వాహనాలకు ధృవీకరణ పత్రాలు లేకుంటే చర్యలు

నవతెలంగాణ - జైనూర్

ప్రతి ఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉదయం నుండి సాయంత్రం వరకు వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, యూనిఫామ్ వేసుకొని వాహనాలు నడపాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని కోరారు. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రవాణా శాఖ సిబ్బంది ఉన్నారు.



నేటి మంత్రుల పర్యటన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి బుధవారం మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిలు, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బోథ్ ప్రభుత్వాస్పత్రి నూతన భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి వస్తున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజనాల రవీంద్ర ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి రూ.10 కోట్ల 50 లక్షల నిధులతో పనులను ప్రారంభించేందుకు విచ్చేస్తున్న మంత్రుల కార్యక్రమానికి బోథ్ మండల జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్లు నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని కొనియాడారు. మన ఆదిలాబాద్ జిల్లా బహు భాషల సమ్మేళన ప్రాంతమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాష పరిరక్షణకు పాటుపడుతూ ఇతర భాషలను నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, తెలుగు విభాగాధిపతి రడాపు సంతోష్ కుమార్, అధ్యాపకులు ప్రతాప్ సింగ్, డా.శ్రీనివాస్, కే.రమేష్, విజయకుమార్, డా.నర్సింగరావు, రఘునాథ్, దయాకర్, తిరుపతి, జ్ఞానేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రసాయనిక ఎరువుల వాడకంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఇన్సెక్టిసైడ్స్ ఇండియా కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ గణేష్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము సూచించారు. మంగళవారం మండలంలోని మొర్కండి గ్రామంలోని రైతు వేదికలో ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ (ఐఐఎల్ ఫౌండేషన్) అధ్వర్యంలో రసాయనాల వాడకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిమిసంహారక మందులు వాడేటప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతి రైతు కూడా కీటక నాశిని పిచికారి చేసేటప్పుడు ఫుల్‌డ్రెస్, మాస్క్, చేతులకు గ్లౌజులు తప్పకుండా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ రిప్రెంజెటేటివ్ అజయ్ రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కనుగుట్ట గ్రామంలో హత్ సే హత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో పాటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలాగే దేశంలో అన్ని ప్రభుత్వ వ్యవస్థలను మోడీ నాయకత్వంలోకి తీసుకొని ప్రయివేటు మిత్రులైనటువంటి గుజరాతి వ్యాపారికి అమ్మేయడం జరుగుతుందని అన్నారు. స్వతంత్ర వ్యవస్థ అయినటువంటి న్యాయవ్యవస్థ పత్రికా రంగ స్వేచ్ఛను గొంతు నొక్కడం జరుగుతుందన్నారు. ఇలా ప్రతి వ్యవస్థను భ్రష్టు పట్టించడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుర్మే మహేందర్, ప్రధాన కార్యదర్శి రాజురెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాబురెడ్డి, కిసాన్ సెల్ నాయకుడు బొడ్డు గంగారెడ్డి, నాయకులు గుంజాల భోజన్న, గుడాల శేఖర్, రవి, అనిల్, విక్రంరెడ్డి, రాకేష్, సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల రమేష్, పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టొద్దు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

తమ వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టి సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పించవద్దని ఎస్సై శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో అపరిచిత నెంబర్ల ద్వారా వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని, ఏటీఎం, బ్యాంక్ అకౌంట్ నెంబర్లను ఇవ్వవద్దని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాల్లో తమ విలువైన సమాచారాన్ని పెట్టి నేరగాళ్ల మొబైల్ ఫోన్ల నుండి విలువైన సమాచారాన్ని సేకరించకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రామచందర్, కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ హమీద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి క్యాతం సంతోష్ రెడ్డి, అధ్యాపకులు నాగరాజు, రవీందర్, నరహరి, రమేష్, స్వరూప, తిరుమల, పోలీస్ సిబ్బంది రాజేశ్వర్, నరేష్, రామకృష్ణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేయడం రాజ్యాంగ విరుద్ధం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజాస్వామిక దేశంలో ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేయడం రాజ్యాంగ విరుద్ధమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులు పవన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హిట్లర్ పాలనను సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. పవన్‌పై దాడి చేసిన నాయకులను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని అన్నారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖయ్యూమ్, బిరుదుల లాజర్, రాజేశ్వర్, సలీం, నరేష్, రవి, జైవంత్ రావు, నిసార్, రాధబాయి, శ్రీరామ్, శంకర్ ఉన్నారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటనను అడ్డుకుంటాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ, గిరిజనులను మోసం చేస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో 22న పర్యటించనున్న ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును అడ్డుకుంటామని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సలాం వరుణ్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 9న అసెంబ్లీ సాక్షిగా 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ తీర్మానించగా ఆదివాసీ గిరిజన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 22న బోథ్ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా వస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును అడ్డుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇటు తమ ఉద్యమం ఎస్టీ జాబితా నుంచి లంబాడలను తొలగించాలని కొనసాగుతున్న తరుణంలో ఆ ఉద్యమాన్ని పట్టించుకోకుండా మరో 11 కులాలను కలుపుతూ తీర్మానం చేయడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే ఈ తీర్మానాన్ని వెనక్కి తీసుకోకుంటే భవిష్యత్తు కార్యచరణను ప్రకటించి, ప్రగతి భవన్ ముట్టడి సైతం దీనికి రెట్టింపుగా చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మార్మోగిన శివ నామస్మరణ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర మందిరంలో గత మూడు రోజుల నుంచి శివరాత్రి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాజరాజేశ్వరునికి దర్శించుకోవడానికి నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జిల్లాలోని ముధోల్, తానూర్, కుంటాల, లోకేశ్వరం, బాసర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి రాజరాజేశ్వరునికి మొక్కిన మొక్కులు తీర్చుకున్నారు. దీంతో సాయంత్రం 6గంటలకు నిర్వహించే అంబలి మొక్కులు తీర్చుకున్నారు. అంబలిని పోసుకొని దానిపై దీపాలను వెలిగించుకొని రాజరాజేశ్వర ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా గ్రామ సర్పంచ్ తూము పుష్పలత రాజేశ్వర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. రాజరాజేశ్వరునికి దర్శించుకోవడానికి మండల నాయకులు ఎంపీపీ లక్ష్మీ బాయి, పీఏసీఎస్ చైర్మెన్ గంగా చరణ్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, మండల అధ్యక్షుడు అనిల్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, బోయిడి విఠల్, గంగాధర్, బి.సంతోష్, చిమ్మన్ పోశెట్టి, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సర్కార్ బడులలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు మొదటగా పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఖుర్షిద్ నగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత ఉర్దూ మీడియం పాఠశాలలో రూ.33.06 లక్షలతో చేపట్టిన పనుల అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 678 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా మన ఊరు మన బడి, మన బస్తి మన బడి కార్యక్రమం కింద 237 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఇందుకోసం రూ.87.95 కోట్లను ప్రభుత్వం వెచ్చించిందని అన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని 214, పట్టణ ప్రాంతాల్లో 23 పాఠశాలలను ఆధునీకరిస్తూ మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ఇందులో 141 ప్రాథమిక, 36 ప్రాథమికోన్నత, 60 ఉన్నత పాఠశాలల్లో వసతులు కల్పించడానికి పనులు జరుగుచున్నవని అన్నారు. మొదటి విడతలో పనులు చేపట్టిన పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీ గోడ, మరమ్మత్తులు, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు, ఫ్యాన్‌లు, తదితర మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలానికి రెండు పాఠశాలల చొప్పున మోడల్ పాఠశాలలు సిద్ధం చేయాలనీ ఆదేశించిన మేరకు, జిల్లాలో 37 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసి 12 రకాల వసతులు కల్పిస్తూ పనులు చేపట్టడం జరుగుచున్నదని అన్నారు. ఇప్పటి వరకు 37 మోడల్ పాఠశాలల్లో పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మౌళిక సదుపాయాలు కల్పిస్తున్న దృష్ట్యా వాటిని సద్వినియోగ పరచుకొని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ, ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు. ఉర్దూ భాషలో విద్యాబోధన అందించి ఉర్దూ మీడియం విద్యార్థులకు ప్రావీణ్యం అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలనీ అన్నారు. రూ.33 లక్షల ఆరు వేల 940 ల వ్యయంతో పాఠశాలలో మరమ్మత్తులు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, తాగునీరు, గ్రీన్ చాక్ బోర్డులు, ఫర్నిచర్, తదితర సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 77 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.19.90 కోట్లతో పనులు చేపట్టడం జరుగుచున్నదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేపట్టి వాళ్ల ఉన్నతికి కష్టపడి విద్యను అభ్యసించాలని అన్నారు. ఈ కార్యక్రమాలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, డీఈఓ ప్రణీత, మున్సిపల్ కమీషనర్ శైలజ, డీఈఈ తిరుపతి, సెక్టోరల్ అధికారి నారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జామ్ గ్రామంలో రూ.2కోట్ల 5లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు వెలుగులు ప్రసాదించే విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు రాష్ట్రంలో నాలుగు వందల గురుకులాలు మాత్రమే ఉండేవని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత 1150 జూనియర్ కళాశాలలను రెసిడెన్షియల్ కళాశాలలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి వరకు ఉన్న కస్తూర్బా పాఠశాలలను 270 జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామని అన్నారు. ఇటీవల పీజీ ఎంట్రన్స్ సగానికి పైగా సీట్లు ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థులు సాధించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, డీఈఓ రవీందర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ విజయ లక్ష్మీ, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రాంరెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్‌లు ఐరా నారాయణ రెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎఎంసీ చైర్మెన్ ఆశిత శ్రీనివాస్ రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ అయిటి చందు, మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ మాధవరావు, ఎంఈఓ మధుసూధన్, ఎంపీడీఓ సరోజ, ఎంఆర్ఓ సంతోష్ రెడ్డి, పాఠశాల ఎస్ఓ అన్నపూర్ణ, గ్రామ సర్పంచ్ మురళీకృష్ణ, ఎంపీటీసీ మహిపాల్, వనజ, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



పట్టణంలోని పలు వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. మంగళవారం స్థానిక షాద్‌నగర్‌లో రూ.15లక్షలతో నిర్మించనున్న రహదారి, డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా పిట్టలవాడలో రూ.15లక్షలతో నిర్మించనున్న రహదారి, మురికికాలువల నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ పట్టణ ప్రజల ఇక్కట్లను తీర్చడానికి కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన అనతికాలంలోనే ఎన్నో ఏండ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపగలిగామని అన్నారు. ప్రతిపక్ష నాయకులు అసలు అభివృద్ధే జరగలేదనడం సరికాదని అన్నారు. అనవసర విమర్శలు మాని ప్రజలకు ఉపయోగపడే సలహాలు ఇస్తే వాటిని స్వీకరించి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీసీఐపై స్పందించకుండా తాత్సరం చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం పరిధిలోని సమస్యలపై చర్చించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు అర్చన రాంకుమార్, సంగీత ధమ్మపాల్, బండారి సతీష్, అశోక్ స్వామి, సంద నర్సింగ్, దివిటి రాజు, నాయకులూ స్వరూప రాణి, దాసరి రమేష్, సంజీవ్ గౌడ్, యోగేష్, శ్రీనివాస్, నరేష్ గౌడ్, దత్తు, సతీష్, గంగారం, శంకర్ పాల్గొన్నారు.

సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి



నవతెలంగాణ-బోథ్

సేవాలాల్ అడుగుజాడల్లో నడువాలని మంగళవారం మండలంలోని సొనాల గ్రామంలో 284వ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఎంపీపీ తుల శ్రీనివాస్ హజరై మాట్లాడారు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాలకు చేసిన సేవలను గుర్తు చేశారు. అలాగే గ్రామంలో సేవలాల్ భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్మించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మాట్లాడుతూ బంజారా జాతికి చెందిన సేవాలాల్ మహారాజ్ నైజం పరిపాలనలో పోరాడి హైదరాబాద్ నగరంలోని ఏకైక స్థానం బంజారాహిల్స్ సంపాదించడం జరిగిందన్నారు. అలాగే సేవాలాల్ భక్తి మార్గంలో ప్రతి ఒక్కరూ నడువాలని సూచించారు. యువకులు చెడు వ్యసనాలకు పోకుండా, మంచి చదువులు చదువుకోవాలని సూచించారు. సొనాల బైపాస్ రోడ్డు చౌరస్తాలోని వచ్చే సంవత్సరం సేవాలాల్ విగ్రహ ప్రతిష్టాపన చేసేందుకు స్థానిక సర్పంచ్ సదానందం ఎంపీపీ తుల శ్రీనివాస్‌ను కోరారు. జిల్లాలోని ప్రతి గ్రామ గ్రామాల్లో సేవాలాల్ జయంతిని నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మాట్లాడుతూ సేవాలాల్ విగ్రహానికి తన వంతు రూ.50 వేలను విరాళంగా ఇస్తానని ప్రకటించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ విగ్రహ ప్రతిస్థాపానికి విరాళంగా రూ.51వేలు అందిస్తానని ప్రకటించారు. అనంతరం సేవాలాల్ జగదంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొనాల గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీఓ రమేష్ రాథోడ్, రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ, స్థానిక సర్పంచ్ సదానందం, పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మండల కన్వీనర్ రుక్మన్ సింగ్, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, ఎంపీటీసీ కురుమ మహేందర్, నాయకులు రాయల్, మహిపాల్, రోహిదాస్, రామాయి సదానందం, మిత్కరే రాజేశ్వర్, సేవాలాల్ సంఘం అధ్యక్షుడు జాదవ్ గుండెరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన శివభక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలి సంఘం సభ్యులు, స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో కలిశారు మండల కేంద్రంలోని ఆలయం పూర్తి సిథిలావస్థలో ఉన్నందున ఎమ్మెల్యేను సభ్యులు నూతన ఆలయానికి నిధులు సమకూర్చాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ నుండి రూ.50 లక్షల మంజూరు చేయిస్తానని అన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధుల నుండి రూ.20 లక్షల పద్మశాలి సంఘం భవనానికి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల చంద్రమోహన్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మేరుగు భోజన్న, మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు ఆడేపు కిరణ్, సంఘ సభ్యులు పోశెట్టి, అనీల్ మాసం పాల్గొన్నారు.



వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- మిషన్ భగీరథ పనుల అసంపూర్తిపై సభ్యుల ఆగ్రహం

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్ అధ్యక్షతన ఎంపీడీఓ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించగా సభ్యులు సమస్యలను లేవనేత్తారు. ముధోల్‌లో నేటికి మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో తాగు నీటి సమస్య తలెత్తుతుందని ముధోల్ సర్పంచ్ రాజేందర్, కోఅప్షన్ సభ్యులు ఖాలీద్ సభదృష్టికి తీసుకువచ్చారు. నాలుగు సంవత్సరాలు దాటినా మీషన్ భగీరథ పనులు పూర్తి స్థాయిలో చేయడం లేదని అన్నారు. వేంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామాలలో గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా గ్రామాలకు దగ్గర ఇటుక బట్టీలను నడుపుతూ అక్రమంగా విద్యుత్, మట్టి, కలప వినియోగించిన సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ముద్గల్ సర్పంచ్ రాంచందర్ సమస్యను లేవనేత్తారు. ముధోల్, ముద్గల్ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీర్చలని సభ్యులు రాజేందర్, రాంచదర్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో చెడిపోయిన స్తంభాలను తోలగించి నూతన స్తంభాలు వేయాలని అన్నారు. వదులుగా ఉన్న తీగలను సరిచేయాలని కోరారు. తరోడా నుండి ఎడ్‌బిడ్ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వెంకటాపూర్ సర్పంచ్ సాయినాథ్ అన్నారు. సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖ అధికారులకు బదులు వారి కిందిస్థాయి అధికారులను పంపడం సరికదాని ఎంపీటీసీ భూమేష్ పేర్కొన్నారు. మండలంలోని పది గ్రామపంచాయతీలకు నూతన భవనాలు మంజూరైనట్లు ఏఈ ఉదయ్ తెలిపారు. ముధోల్ గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చాలని, ముధోల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ముధోల్ సర్పంచ్ అన్నారు. శనగ కొనుగోలు టోకెన్‌లను త్వరితగతిన ఇవ్వాలని సభ్యులు రాంరెడ్డి, భూమేష్‌లు అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సురేష్ బాబు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ నాయకుడు రేవంత్ రెడ్డి చేపడుతున్న హాత్ సే హాత్ జోడో పాదయాత్రకు వస్తున్న ప్రజాదారణను అధికార పార్టీ నాయకులు ఓర్వలేక, యూత్ కాంగ్రెస్ నేతలపై దాడి చేయడం సిగ్గుచేటని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ అన్నారు. వరంగల్‌లో యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై అధికార పార్టీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనుచరులు దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ నాయకులు ఆందోళన దిగారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు యూత్ కాంగ్రెస్ నాయకులకు మధ్య తోపులాట జరిగడంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా చరణ్ గౌడ్ మాట్లాడుతూ తమ యువజన కాంగ్రెస్ నాయకుడుపై వందల మంది కలిసి దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రశ్నించే గొంతులు నొక్కేందుకు అధికార పార్టీ నాయకులు ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఆర్భాత్, వైస్ ప్రెసిడెంట్ నాహిద్, ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మావల మండల అధ్యక్షుడు శేఖర్, బీంసరి ఉపసర్పంచ్ మల్లయ్య, ఫైయిమ్, తాహేర్ ఖాన్, రాజు, మోసిన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పీచర గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామి పనులను మంగళవారం డీఆర్డీఓ విజయలక్ష్మి పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఓస ప్రసాద్, ఏపీఓ ప్రమీల, టీఏ దినేష్, నారాయణ, ఫీల్డ్ అధికారులు పాల్గొన్నారు.

లింగి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు



లింగి వృద్ధాశ్రమంలోని 50 మంది వృద్ధులకు సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండే సొనాల గ్రామానికి చెందిన ఈర్ల ఎర్రన్న కుమారుడు అఖిల్ నూతన దంపతులతో పాటు కుటుంబ సమేతంగా మంగళవారం అన్నదానంతో పాటు పండ్ల పంపిణీ చేశారు. వృద్ధులకు భగవద్గీత పుస్తకాలను అందించారు. అనంతరం నూతన దంపతులు ఆశ్రమంలోని వృద్ధులను కలిసి వారి ఆశీస్సులు, తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ప్రజలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ నాయకులు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్, శ్రీరామ్‌నగర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను నయవంచనకు గురి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయని సంతోష్ సీనియర్ నాయకులు, దాదే మల్లయ్య, సింహారాజుల ఆనంద్, మాజీ వార్డ్ మెంబర్ నారపాక నర్సయ్య బూత్ అధ్యక్షులు గట్టు శ్రీనివాస్ దేవుళ్ల రాజేశ్వర్ చిన్నారెడ్డి అంకం మహేందర్, నల్లా రవిందర్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కొత్తూరు గ్రామస్తులు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమీక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రాన్ని అభివృద్ధి పయనంలో నడిపిస్తున్నాయని అన్నారు. బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ, కాలం గడుపుతున్నారే తప్ప తెలంగాణ రాష్ట్రానికి తెచ్చింది ఏమి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి రాష్ట్ర ప్రజలు గులాబీ కండువా వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, ఎంపీటీసీ చంటి, సర్పంచ్‌లు రాంబాయి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, అబ్దుల్లా, గంగారెడ్డి, సంతోష్, ప్రకాష్, పల్లవి, విఠల్, మల్లేష్, నర్సింలు పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 22 ఫిబ్రవరి 2023

మాతృభాష ఎంతో గొప్పది : భౌమిక్

ఆసిఫాబాద్ : మాతృభాష ఎంతో గొప్పదని, హావభావాలను సులభంగా ఇతరులకు చేర్చడానికి పనికి వస్తుందని గిరిజన సంక్షేమ శాఖ ఏటీ భౌమిక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర సంచాలకుడు అష్టావధాని మాడుగుల నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన మాతృభాష దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఉపాధ్యాయులకు బాలల భాగవతం పుస్తకాలను అందజేశారు. అనంతరం గోండి, కొలామీ, అంధ్, గోర్మాటీ, మరాఠీ, తెలుగు మాతృభాషలు గల విద్యార్థులు తమ తల్లిభాష గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ కవుల సంఘం(ఆకసం) వ్యవస్థాపకులు నల్లగొండ రమేశ్, కవయిత్రి జ్యోతి, సీనియర్ ఉపాధ్యాయులు కైలాస్‌పతి, దినేశ్, శ్రీనివాస్, ఆకసం ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

టైగర్‌జోన్‌లో గ్రాస్ ల్యాండ్ల పరిశీలన
నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో పీసీసీఎఫ్ డొబ్రియల్, మంచిర్యాల డీఎఫ్ఓ ఆశీస్ సింగ్ లు మంగళవారం పరిశీలించారు. టైగర్‌జోన్‌లోని, భర్తన్‌పేట అడవి ప్రాంతంలో ఉన్న గ్రాస్ ల్యాండ్ పరిశీలించి విత్తనాలు సేకరణపై, సమగ్ర విషయాలు తెలుసుకొని, కామాన్పల్లి వాచ్ టవర్, మైసమ్మకుంట, గనిశెట్టి కుంటాలను సందర్శించి, నీటి నిల్వల గురించి ఆరా తీశారు. అడవిలో జంతువుల సంరక్షణపై ప్రత్యేక నిఘ ఉంచాలని అటవీ అధికారులకు సూచించారు. నీల్గాయ్ కుంట, గోండుగూడా, అడ్డబోరు ఏరియాలలో పర్యటించి, జింకలు, నెమళ్లు, ఇతర అడవి జంతువులు పక్షులపై పూర్తి వివరాలను ఎంపీడీఓ మాధవరరావును అడిగి తెలుసుకున్నారు. వచ్చేది వేసవికాలం బాబట్టి నిప్పుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అడవిలో నిప్పు తగిలి కాలిపోతుంటే వెంటనే అధికారులు స్పందించి ఆర్పి వేయాలని సూచించారు. జంతువుల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పంచాయతీ ట్రాక్టర్లను ప్రైవేటు పనులకు వాడరాదు



నవతెలంగాణ-తాండూర్

పంచాయతీ ట్రాక్టర్లను ప్రైవేటు పనులకు వాడరాదని, వాడినట్లయితే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి ఫణింధర్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రేచీని పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణల నిమిత్తం విచారణ చేపట్టారు. పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు పంచాయతీ అభివృద్ధి పనులకు మాత్రమే వాడుకోవాలని తెలిపారు. రేచిని పంచాయతీ సెక్రెటరీ జీపీ ట్రాక్టర్‌ను ప్రైవేటు పనులకు వినియోగించి రూ.200 రుసుము వసూలు చేసినట్లైతే పంచాయతీ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ప్రత్యేక పరిస్థితుల్లో దహన సంస్కారాలు, వివాహ వేడుకలసమయాల్లో చెత్త సేకరణ నీటి సరఫరా చేసి పంచాయతీకి నిధులను సమకూర్చుకోవచ్చుని తెలిపారు. గ్రామపంచాయతీలకు ప్రాతినిధ్యం వహించే సర్పంచులు మాత్రమే కార్యనిర్వాహణ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సర్పంచ్ స్థానంలో ఏ ఇతర వ్యక్తులు యజమాషి చెలాకించరాదని సూచించారు. విచారణ విషయాలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు వివరించారు. ఎండాకాలం నేపథ్యంలో అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాల్లో జీపీ ట్రాక్టర్ ద్వారా మొక్కలకు నీటిని అందించాలన్నారు. రేచీనిలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలోని ఎంపీకేత్రీ పంచాయతీ సందర్శించి రికార్డులను పరిశీలించి సెక్రటరీకి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రేచిచి సర్పంచ్ దుర్గబాయి, ఎంపీఓ సత్యనారాయణ కార్యదర్శి శ్రీనివాస్, ఎన్‌వీకే త్రీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా గోస-బీజేపి భరోసా కార్నర్ మీటింగ్
నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి, జల్లెడ, జాజులపేట గ్రామాల్లో మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు బి.మల్లేష్ ఆధ్వర్యంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్‌గౌడ్, నియోజకవర్గ ప్రభారీ అన్నపూర్ణ సుదర్శన్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోందని రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని అన్నారు. సమావేశాల్లో మండల ఉపాధ్యక్షులు ఏట మధుకర్, తలండి రమేష్, భీమేష్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, బట్టు మల్లేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెనుముల వెంకటేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దొబ్బల శంకర్, బీజేవైఎం అధ్యక్షుడు రౌతు సుధాకర్, కోయిల స్వామి, పందుల రాజు, చల్ల రాజేష్ పాల్గొన్నారు.

జన్నారం పోలీస్‌స్టేషన్ తనిఖీ



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రామ్నాథ్, ఏసీపీ తిరుపతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా అదనపు ఎస్సై తానాజీ నాయక్ ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సంజీవ్ పాల్గొనారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం
నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక 22వ వార్డులో మంగళవారం నిరుపేద వృద్ధుడు మంద మల్లయ్య మరణించాడు. దహన సంస్కారాలకు సహాయం చేయాలని స్థానిక ప్రజల సమాచారం అందించగా వెంటనే స్పందించిన స్థానిక వార్డు కౌన్సిలర్ ఎర్రబెల్లి ప్రేమలత రాజేష్ వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మన్న దృష్టికి తీసుకు వెళ్లారు. వారు ఆ కుటుంబాన్ని పరామర్శించి మంద మల్లయ్య మృతి కి ప్రగాఢ సంతాపాన్ని తెలిపి బాల్క ఫౌండేషన్ ద్వారా తక్షణ సహాయంగా రూ.5000 ఆర్థిక సాయం అందించారు. అలాగే జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజా రమేష్‌కు స్థానిక ప్రజలు విషయం తెలుపగా వెంటనే స్పందించి దహన సంస్కారాలకు రూ.4000 ఆర్థిక సాయం అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సఖి సేవలపై అవగాహన
నవతెలంగాణ-ఆసిఫాబాద్

సఖి కేంద్రం నిర్వాహణ, సేవలపై మండలంలోని ఇట్యాల, బెల్గాం, గోండుగూడా గ్రామాల్లో మహిళలకు నిర్వాహకులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసే చోట వేధింపులు లైంగిక హింస, అక్రమ రవాణా, బాల్య వివాహం ట్రాఫికింగ్ లాంటి అంశాలు కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాధిత మహిళలకు సఖి కేంద్రంలో అందించే 5 రకాల సేవలని (వైద్య సేవలు, కౌన్సెలింగ్ సదుపాయం, పోలీస్ సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి)పై వివరించారు. మహిళ హెల్ప్ లైన్ 181, 8500785181 నెంబర్‌ను ఉపయోగించుకోవాలని, 18 సంవత్సరాలు నిండక ముందు బాల్య వివాహాలు చేయద్దని వాటి వల్ల ఎదుర్కునే సమస్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సఖి సిబ్బంది మౌనిక పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన సన్మార్గంలో నడవాలి

- ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- ఘనంగా సేవాలాల్ 284వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడువాలని ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన మైదానంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలకు ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌తో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి రోజునే కాకుండా నిరంతరం ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. సేవాలాల్ దీక్ష పరులకు ప్రధాన క్షేత్రమైన శంకర్ లొద్దిని టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు. అంతకుముందు నాయకులు మాట్లాడుతూ బంజారా భవన్ సేవాలాల్ గుడి నిర్మాణం



సభలో మాట్లాడుతున్న కోవ లక్ష్మి



మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్

కోసం స్థలం అడగగా దానిపై స్పందిస్తూ సేవాలాల్ ఉత్సవ కమిటీ నిరంతరం పనిలో ఉండాలని నాయకుల వెంటపడి పనిచేయించుకోవాలన్నారు. రాష్ట్ర రాజధానిలో నిర్మించినట్లు జిల్లా కేంద్రంలో కూడా బంజారా భవన్ నిర్మించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కొత్తపెల్లిలోని దీక్ష భూమి అభివృద్ధికి ప్రయత్నం చేస్తామని అన్నారు. అంతకుముందు ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ మాట్లాడుతూ 284 సంవత్సరాల క్రితం సేవలాల్ చెప్పిన అంశాలు నేటికీ ఆచరణలో ఉన్నాయని అన్నారు. రానున్న కొన్ని యుగాల వరకు ఇవి వర్తిస్తాయని వాటిని అనుసరించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. నిత్య జీవితంలో మనిషి పాటించాల్సిన 25 అంశాలు సేవాలాల్ తెలియజేశారని అన్నారు. తల్లిదండ్రులకు విలువ ఇవ్వడం లాంటి అంశాలు కూడా ఇందులో ఉన్నాయని అన్నారు. ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మాట్లాడుతూ సేవాలాల్ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచిన ప్రేమ్ సింగ్ మహారాజ్‌కు పద్మశ్రీ ఇవ్వాలని దీనికోసం ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పించాలని కోరారు. ఎమ్మెల్యే ఆత్రంసక్కు మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఆధ్యాత్మిక కార్యక్రమంఅని అన్నారు. దేశానికి సేవాలాల్ దీక్ష పరిచయం చేసింది ప్రేమ్ సింగ్ మహారాజ్ అని జాతీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చేస్తున్నారని అన్నారు. పద్మశ్రీ అవార్డుకు ప్రేమ్ సింగ్ మహారాజ్ అర్హుడేనని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలు జాతికి గుర్తింపు తీసుకువస్తాయని వాటిని బతికించుకొని జాతిని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత బంజారాలపై ఉందన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా సెలవు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రికి తెలియజేయునున్నట్లు వివరించారు. అంతకుముందు అఖిలభారత బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం నాయక్ మాట్లాడుతూ జిల్లాలో బంజారా భవన్ సేవాలాల్ గుడి నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. అంతకుముందు దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ నిర్వహించిన భోగ్ బండార్ కార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిలు, మహిళలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ, ఎంపీపీ మల్లికార్జున్, సేవాలాల్ ఉత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవినాయక్, కార్యదర్శి శివప్రసాద్ గౌరవ అధ్యక్షుడు శంకర్ నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ నాయక్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, నాయకులు రాథోడ్ గణేష్, ఆత్మారాం నాయక్, కిరణ్ నాయక్, జాదవ్ గణపతి, రాథోడ్ నారాయణ, ధర్మ ప్రచారక్ అడేప్రేమ్ పాల్గొన్నారు.



వేడుకల్లో భాగంగా పట్టణంలో ర్యాలీ

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- భగీరథ నీరెక్కడని మండిపాటు
- పంచాయతీ నిధులపై నిలదీత
- ఎజెండా వివరాలు లేకుండా హాజరైన ఎఫ్ఆర్ఓ

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అన్నం మంగ అధ్యక్షతన మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వాడివేడిగా సాగింది. పలు గ్రామాల సర్పంచ్‌లు జీపీలకు వచ్చిన నిధులను తమకు సమాచారం ఇవ్వకుండానే అధికారులు ఖర్చు చేస్తున్నట్లు ఎంపీఓ ప్రసాద్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డిలను నిలదీశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశంలో మాత్రమే అధికారులు తమకు కనిపిస్తున్నారని ఆ తర్వాత గ్రామాల్లోకి రావడం లేదని, ఒకవేళ వచ్చిన కూడా సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిమ్మాపూర్‌లో మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదని ఎంపీటీసీ గడుసు స్వప్న మండిపడ్డారు. కొత్త కొమ్ముగూడెం సర్పంచ్ బండి సత్తయ్య, కొత్తూరు సర్పంచ్ సొల్లు సురేష్, జెండా వెంకటాపూర్ సర్పంచ్ ఎల్తాపు సునీతలు సర్పంచ్‌లు నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులను అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా వారికి ఇష్టం వచ్చిన పనులకు కేటాయిస్తే సర్పంచ్‌లుగా మేము ఎందుకు అని ప్రశ్నించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి నాగవత్ స్వామి ఆ శాఖ ఎజెండా ఖర్చు వివరాలు లేకుండా సమావేశానికి రావడం విడ్డురంగా ఉందని జడ్పీటీసీ ముత్తే సత్తయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు దేవాలయాల దగ్గర మద్యం అమ్మకాలు జరుగకుండా గట్టి చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ ఆదేశించారు. సర్పంచ్‌ల నిధులు వారికి తెలియకుండా ఖర్చు చేయడంపై జడ్పీటీసీ సంబంధిత అధికారులను నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు యూనిఫామ్‌లు ధరించడంలో ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ ఏంఈఓ రవీందర్‌ను ప్రశ్నించడంతో ఇకపై పాఠశాలల్లో విద్యార్థులు యూనిఫామ్ ధరించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ గైర్హాజరవ్వగా, 4 శాఖల అధికారులు మినహా అందరూ హాజరైనారు.

ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, జడ్పీటీసీ ముత్తే సత్తయ్య, వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, తహసీల్దార్ జోత్స్న, ఎంపిడిఓ నాగేశ్వర్ రెడ్డి, ఏఓ ప్రభాకర్, పీ ఆర్ఏఈ శృతి, సీడీపీఓ రేష్మ పాల్గొన్నారు.



క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు రాణించాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్



నవతెలంగాణ-మంచిర్యాల

ఆటల పోటీల్లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో రాణించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ అన్నారు. పాత మంచిర్యాలలోని మున్సిపల్ క్రీడా మైదానంలో జరుగుతున్న బోలిశెట్టి హనుమంతు పటేల్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లీగ్ మ్యాచ్ ప్రారంభోత్సవానికి మంగళవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన గాజుల ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో ఆటగాళ్లు పోటీల్లో పాల్గొనాలని అన్నారు. క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్న టోర్నమెంటు నిర్వాహకులను అభినందించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాత మంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బొలిశెట్టి కిషన్, ఎర్రం ప్రభాకర్‌లతోపాటు టోర్నమెంట్ ఆర్గనైజర్లు అంబ్రోస్, రమేష్ యాదవ్, పానుగంటి చందు, బోలిశెట్టి ప్రశాంత్, రాకేష్‌తో పాటు క్లబ్ సభ్యులు తూముల ప్రభాకర్, బొలిశెట్టి వెంకటేష్, రాజన్న, వైభవ్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పట్టింపేది : సీఐటీయూ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

యాజమాన్యం కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని, గని కార్మికులకు ఇచ్చిన ఇంటి కిరాయి ఓసి కార్మికులకు ఎందుకు ఇవ్వడం లేదని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ అన్నారు. మంగళవారం కెకె ఓసీ గని మీద ఆ గని పిట్ సెక్రటరీ మేడి రాజమల్లు ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు గోపాల్ మాట్లాడుతూ గని ఉన్నప్పుడు ఇచ్చిన ఇంటికిరాయిని ఓసిగా మారిన తర్వాత గెలిచిన సంఘాల నిర్లక్ష్యం వల్లనే ఇవ్వడం లేదని విమర్శించారు. మందమర్రి కార్మికుల పట్ల గెలిచిన సంఘాలతో పాటు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వల్లనే కొత్తగా ఏర్పడిన నస్పూర్ మున్సిపాలిటీకి ఇంటికిరాయిని అమలు చేస్తూ క్యాతనపల్లి మున్సిపాలిటీకి అమలు చేయడం లేదని కార్మికులను ఏకం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి స్థలాల్లో పట్టాలు ఇస్తు, సింగరేణి కోటర్లను సైతం పేదవారికి ఇస్తామని చెబుతున్న ప్రజాప్రతినిధులు 30 సంవత్సరాలకుపైగా రక్తాన్ని కంపెనీకి ధారపోసిన కార్మికులకు ఎందుకు ఇవ్వరని ప్రతిపాదన ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. కార్మికులందరూ యూనియన్లకు అతీతంగా ఏకమై పోరాడాలని సీఐటీయూ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఆరిఫ్, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకట స్వామి, అల్లి రాజేందర్, అలవాల సంజీవ్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలోని షెట్‌పల్లిలో మంగళవారం ఉచిత దంత వైద్య పరిక్షలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన శ్రీకాంత్ డెంటల్ ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మేడి రవి తెలిపారు. ఈ వైద్య శిభిరం ద్వార గ్రామానికి చెందిన 43 మందికి వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ వైద్య శిభిరంలో దంత వైద్య నిపుణలు శ్రీకాంత్, ఖయూమ్, రేణుక పాల్గొన్నారు.

మాతృభాషను కాపాడుదాం
నవతెలంగాణ-తాండూర్

మాతృభాష మాట్లాడుతూ భావాలను వ్యక్తపరచడం ద్వారా భాషా సంస్కృతిని కాపాడుకోవచ్చని కస్తూర్బా ఎస్ఓ కవిత అన్నారు. మంగళవారం కస్తూర్బా పాఠశాలలో మాతృభాష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనస్సులోని భావాల వ్యక్తీకరణతోపాటు ఒక జాతి, ప్రాంత సంస్కృతీ వారసత్వ సంపదల్లో మాతృభాషకు అగ్రస్థానం ఉంటుందన్నారు. ప్రజలు ఆచార వ్యవహారాలు ఇచ్చి పుచ్చుకునే భావ వినిమయం భాష ద్వారా జరుగుతుందన్నారు. అలా భాషను ఉపయోగించినంత కాలం సజీవంగా వర్ధిల్లుతుందనీ, అలా వాడుకలో లేని భాష క్రమంగా అంతరించిపోయే ప్రమాదముందన్నారు. అందుకే బడిలో బోధనాభ్యసన భాష ఏదైనప్పటికి ఇంటివ్యవహారాల్లో ప్రతి ఒక్కరు తమ మాతృభాషలో మాట్లాడుకోవడం ద్వారా భాషను సజీవంగా నిలుపవచ్చుని తెలిపారు. పిల్లల చేత వేషధారణ చేయించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తిమ్మాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం చంద్రయ్య, వార్డు సభ్యులు రాజన్న, లక్ష్మీ, భూమన్న, జాడి వెంకట్, క్రేజీ యూత్ అధ్యక్షుడు ప్రదీప్, వెంకటేష్, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందించాలి

- జిల్లా సెక్టోరియల్ అధికారికి వినతి

నవతెలంగాణ-మంచిర్యాల

పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సెక్టరియల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, తెలంగాణ మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అందించే అల్పాహారాన్ని హెచ్ఎంల ద్వారా అందిస్తున్నారని, ఇది కూడా కేవలం 34 రోజులు మాత్రమే అందించడం జరుగుతుందిని తెలిపారు. అల్పాహారం అందించే విషయంలో గత నాలుగు రోజులు గడిచిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలాంటి మెనూ విడుదల చేయలేదని, ప్రభుత్వం పాఠశాల హెచ్ఎంలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి రూ.15 ఖర్చు పెట్టాలని చెప్పి, ముందుగానే విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ఆయా పాఠశాల అకౌంట్‌లోకి ఆ డబ్బులు కూడా ప్రభుత్వం జమ చేసిందని, హెచ్ఎంలు మాత్రం కేవలం రూ.5 బిస్కెట్, ముంగుదాల్ పప్పు ప్యాకెట్లను విద్యార్థులకు అందిస్తున్నారని తెలిపారు. కొంతమంది హెచ్ఎంలు మాత్రం విద్యార్థులకు పెట్టె అల్పహారానికి సంబంధించిన వస్తువులు కొన్ని మాత్రమే తీసుకొని వచ్చి మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చి, వీటిని తయారు చేసి పిల్లలకు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కట్టెలు, గ్యాస్, తయారీ వస్తువులు అన్ని భరిస్తూ, సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉంటున్నారని, మధ్యాహ్న భోజన కార్మికులు కష్టపడి పనిచేస్తే, ఇచ్చే వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. వచ్చే కోడిగుడ్డు బిల్లు ఇప్పటివరకు రాలేవని తెలిపారు. ప్రత్యేకంగా రాగి జావా తయారుచేసి ఇస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, సునీత, తిరుపతి, రాంచందర్ పాల్గొన్నారు.



ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ పరీక్షలకు 28 మంది హాజరు కాగా ఇందులో 12 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగానే ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమజిస్టులు వసీ, గోపీ పాల్గొన్నారు.



సేంద్రియ సాగుకు సహకారం : ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ - కౌటాల

సేంద్రియ ఎరువులను వాడుతూ సాగుచేస్తున్న విద్యావంతులకు సహకారమందిస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన సునంద, రవి డిగ్రీ వరకు చదువుకొని సేంద్రియ సాగుతో పంట దిగుబడి తీసుకొచ్చి అందరికి ఆదర్శంగా నిలవాలని సంవత్సరం నుండి సేంద్రియ సాగు వ్యవసాయం చేస్తున్నారు. ఎమ్మెల్యే వ్యవసాయ సాగు క్షేత్రాన్ని సందర్శించి వారికి సేంద్రియ వ్యవసాయ సాగు కోసం సహకారమందిస్తానని హామీ ఇచ్చారు. వారి వ్యవసాయ క్షేత్రానికి సదరు రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, సర్పంచ్ వొజ్జెల మౌనీష్, బీఆర్ఎస్ నాయకులు మధూకర్, శ్రీనివాస్, బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్ ఉన్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించడంలో విఫలం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ విమర్శించారు. మంగళవారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని రోడ్లు అధ్వాన్నంగా మారాయని, దుమ్ము ధూళితో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టింపు లేదని అన్నారు. ప్రధాన రహదారుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం చేయడం లేదని అన్నారు. సిర్పూరు పేపర్ మిల్లుకు వచ్చే లారీల కారణంగా కాలుష్యం పెరుగుతోందని అన్నారు. మరోవైపు పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ కాకపోవడంతో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఏర్పడుతోందని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి వెంటనే పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జె రాజేందర్, గొడిసెల కార్తీక్, రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం డీవైఎఫ్ఐ 2023 క్యాలెండర్‌ను బండారు రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. బీజేపీ హయాంలో యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



నవతెలంగాణ - జైనూర్

క్రీడల్లో గెలుపోటములు సహజమని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుక్యా గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం మోతీపటార్ గ్రామంలో కొన్ని రోజుల నుండి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ చేసిన పాలనను నేటి వరకు ప్రజలు మరువలేదని గుర్తు చేశారు. అప్పటికాలంలో పేద ప్రజలకు ఎంతో మంచి సంక్షేమ పథకాలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ఆయన చేసిన సేవలు, సంక్షేమాన్ని నేడు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. వైఎస్ఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో నేటికి వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. టోర్నమెంట్ విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, నార్నూర్ మండలానికి చెందిన వారికి రెండో బహుమతి మోతిపటార్ యూత్ అసోసియేషన్‌కు రూ.11 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ పద్మనాను, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగతనాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని పలు చోట్ల పట్టపగలే చోరీలకు పాల్పడుతూ దొంగలు రెచ్చిపోతున్నారు. వారం వ్యవధిలోనే అనేక సార్లు దొంగతనాలు చేస్తూ ఇటు ప్రజలకు అటు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. పోలీసులకు క్లూస్ దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పట్టపగలే చోరీలతో ప్రజలను బేంబేలెత్తిస్తున్నారు. తాజాగా మంగళవారం పట్టపగలు స్థానిక కోర్టు ఏరియాలోని మస్తాన్ గూడా లోని తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం చేశారు. అనంతరం గంటల వ్యవధిలో రాంనగర్ గోదావరి రోడ్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంటి వెనుక వైపు గల తలుపులు తెరిచి దొంగతనం చేయడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. కాగా, ఇటీవల దొంగలు రెచ్చిపోవడంతో పోలీసులు ఆయా కాలనీ వాసులకు సీసీ కెమెరాలు తమ కాలనీల్లో, ఇండ్లలో ఏర్పాటు చేసుకోవాలని సలహాలు ఇవ్వడంతో కాలనీ వాసులు సీసీ కెమెరాల కోసం చందా డబ్బులు జమ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దళితులకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నవతెలంగాణ-తాంసి

దళితులకు 15 శాతం రిజ్వేషన్లను కల్పించాలని మంగళవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో నేతకాని మహార్ సంఘం నాయకులు అన్నారు. నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నర్సయ్య మాట్లాడుతూ మహార్ కుల ధృవీకరణ పత్రాలు ఆర్డీఓ ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారానే ఇవ్వాలని అన్నారు. అర్హులైన దళితుల అందరికి దళితబంధు కేటాయించాలని అన్నారు. గతంలో 3 ఎకరాల దళిత బస్తీ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న దళితులకు 15శాతం రిజర్వేషన్ కేటాయించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు న్యాయం చేసి పరిష్కరించాలని కోరారు. నుతంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాటిల్ రామారావు, రాష్ట్ర నాయకులు భగత్ యాదవ్, మునేశ్వర్ విజయ్, భారత్, జిల్లా అధ్యక్షులు కాంబ్లే భీంరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మునేశ్వర్ సుదర్శన్, జిల్లా కార్యదర్శి పాటిల్ సృజన్, తలమడుగు మండల అధ్యక్షుడు మునేశ్వర్ స్వప్నిల్, భీంపూర్ మండల అధ్యక్షులు కామడే మహేంధర్, ఉపాధ్యాక్షులు నగరాడే మోక్షవీర్, నాయకులు బొరే వార్లు, సురేష్ కామడే, పాటిల్ సోమన్న, కాయపక్ సుభాష్, భగత్ నిశికాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తాంసి

మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ మునిగెల బుజ్జన్న తల్లి భూదేవి గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అయన వెంట ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ సదానందం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేందర్, నారాయణ పలువురు కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల ధ్యేయం

- తత్రపోష గూడెంలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం
- అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు
- డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమని, మారుమూల గిరిజన గ్రామాల్లో అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని శాంతి భద్రతలకు అందరూ సహకరించాలని మంచిర్యాల డిసిపి కేకన్ సుధీర్ రాంనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లపేట పంచాయతీ పరిధిలోని తత్రపోషగూడ గిరిజన గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి కమ్యూనిటీ కాంట్రాక్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని యువకులకు వాలీబాల్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత అన్ని రంగాల్లో రాణించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చిన వేళ అందుకు సంబంధించిన పుస్తకాలతో గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఎవరైన ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైన అనుమానితులు గ్రామాల్లో కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు ఆకర్షితులు కావద్దని కోరారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎసిపి తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, దండేపల్లి ఎస్సై సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించిన పవర్‌మేక్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ యూనియన్ కార్మికుల తరపున పలు ప్రతిపాదనలను ప్రవేశపెట్టింది. థర్మల్ పవర్ ప్లాంట్ పరిధిలో సుమారుగా 1450 మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తుండగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులను సాధించుకోవడం కోసం గత ఏడాది మే 27న పలు డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పలుమార్లు పవర్‌మేక్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమై చేపట్టిన చర్చలు వాయిదాలు పడిన సందర్భంగా నాల్గవ సారి హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎల్‌సీ ఎదుట చేపట్టిన చర్చల్లో సానుకూలంగా స్పందించింది. కార్మిక యూనియన్ ప్రవేశపెట్టిన 17 డిమాండ్లలో 10 డిమాండ్లకు పవర్‌మేక్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకోవడంతో పాటు మరో మూడు డిమాండ్ల పరిష్కారం కోసం సింగరేణి సంస్థకు సిఫారస్ చేస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ప్రధానంగా పవర్‌మేక్ కంపెనీ ప్రతినిధులతో బీఎంఎస్ అనుబంధ కాంట్రాక్టు కార్మికుల మధ్య కుదిరిన ఒప్పందంలో ప్లాంట్‌లో పని చేస్తున్న హై క్వాలీఫైడ్ ఉద్యోగులకు ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగవకాశం కల్పించడం. ఫ్యాక్టరీలో ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ప్రతి కార్మికుడికి ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా ప్రమోషన్ ఇవ్వడం. క్యాంటీన్ నిర్వహణ సబ్సిడీ పద్ధతిలో ఇవ్వడం, ల్యాండ్ లూజర్స్ టెండర్ ప్రక్రియ ద్వారా క్యాంటీన్ నడపాలన్న డిమాండ్‌ను సింగరేణికి సిఫారస్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న హౌజ్ కీపింగ్ కార్మికులకు ప్రతి నెల కిలో బెల్లం, మిగతా డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న వారికి ఆఫ్ కేజీ బెల్లం ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. అదేవిధంగా వాషింగ్ సోప్ ప్రతి నెల 7వ తేదీ లోపు కార్మికుల ఖాతాల్లో జీతాలు జమ చేయడం, సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కార్మికులకు ఫ్లేడే లీవ్‌లు ఇవ్వడం సింగరేణి సంస్థకు సిఫారస్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ పేరం రమేశ్, ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బోడకుంట శ్రీదర్, వైస్ ప్రెసిడెంట్ చిలకాని వెంకటేశ్వర్లు, రామగిరి మల్లేశ్, సురేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దఫాలుగా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, పోడు భూములకు పట్టాలిస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చి తప్పారని నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని భూపాలపట్నం గ్రామంలో బీజేపీ చేపట్టిన ప్రజా గోస - బీజేపీ భరోసా శక్తి కేంద్రం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకుల, ప్రభుత్వ అధికారుల మేలు కోసం ఎక్కువ శ్రద్ధ వహిస్తోందని విమర్శించారు. దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలు, ప్రాజెక్టులు అందించామని గొప్పలు చెప్పుకోవడానికే సరిపోతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సమస్యలను తెలుసుకోవడానికే ఈ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ఏ గ్రామానికి కూడా సరైన సౌకర్యాలు లేక ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, వీటిపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు. బీజేపీ అధికారంలోకి రాగానే పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం ఉంటుందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ప్రతి నిరుపేదకు ఇల్లు కట్టించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎల్కులె శంకర్, మండల ఇన్‌చార్జి ముత్తు అశోక్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి చౌదరి రమేష్, భజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, బీజేవైఎం మండలాధ్యక్షుడు బనార్కర్ సాయి, శ్యాంరావు, శ్రీశైలం, సంతోష్, చెన్నమల్లు పాల్గొన్నారు.

బెజ్జూర్ : రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ మండలాధ్యక్షుడు జాడి దిగంబర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోతెపెల్లి గ్రామంలో శక్తి కేంద్రంలో ప్రజా గోస - బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో రోడ్డు, డ్రైనేజీలు, ధరణి సమస్యలు, మిషన్ భగీరథ, పోడు భూముల సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి సమీర్ గుప్తా, రామ్‌టెంకి సురేష్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మెర తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఉమ్మెర బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ తాళ్ల రామయ్య, మాజీ సర్పంచ్ వసీఉల్లాఖాన్, ఉప సర్పంచ్ కోర్తె తిరుపతి, తేల బాపు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగు



నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని మారుమూల గ్రామాల మధ్య గల వాగులపై వంతెనల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలో రెండు వంతెనల నిర్మాణం కోసం రూ.5.11 కోట్లు మంజూరు కావడంతో ఎమ్మెల్యే కోనప్ప భూమిపూజ చేశారు. సలుగుపెల్లి-సులుగుపెల్లి, సలుగుపెల్లి-బారెగూడ గ్రామాల మధ్యగల రెండు ఒర్రెలపై వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిఏటా వర్షాకాలంలో వాగులు ఉప్పొంగిన సమయంలో రవాణా సౌకర్యానికి అంతరాయం కలుగుతుందని, వంతెనల నిర్మాణంతో రాబోయే రోజుల్లో ప్రజల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు సిడాం సకారాం, సర్పంచ్‌లు రవి, హనుమంతు, ఎంపీటీసీలు శ్రీనివాస్, వెంకన్న, నాయకులు దోకె వెంకన్న, పుల్లూరి సతీష్, రేణిగుంట్ల పెంటయ్య, నరేందర్‌గౌడ్, జాయిద్ హుస్సేన్, రవీందర్‌గౌడ్, కర్పెట రమేష్, షౌకత్ పాల్గొన్నారు.

పంచతత్వ ఉద్యానవనం ప్రారంభం



ఆదిలాబాద్‌అర్బన్ : పట్టణ సుందరీకరణతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. అందుకు అనుగుణంగా పార్కులు, ఓపెన్ జిమ్‌లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పట్టణంలోని గాంధీ పార్కులో రూ.8లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పంచతత్వ పార్కును మంగళవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. పంచతత్వ పార్కులో వాకింగ్, వ్యాయామం వంటివి చేస్తే కలిగే ప్రయోజనాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించగా కొంతసేపు ఆయన సరదాగా వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణకు తెలంగాణలోనే రెండవ పంచతత్వ పార్కును అభివృద్ధి చేశామన్నారు. పట్టణ సుందరీకరణ నిమిత్తం దాదాపు రూ.25కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే గాంధీ పార్కులో రూ.2.56కోట్లతో పనులు పూర్తయ్యాయని వివరించారు. మరో రూ.2కోట్లతో పార్కు చుట్టూ వాకింగ్ కోసం ఫుట్‌పాత్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ పరిపూర్ణ ఆరోగ్య సంరక్షణకు పాటు పడుతున్నామని స్పష్టం చేశారు. ఓపెన్ జిమ్‌లు, క్రీడా ప్రాంగణాలు, ట్రీ పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకుని నిత్య జీవితంలో వ్యాయామాన్ని భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ అర్చన రామ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్ అశోక్ స్వామి, సంద నర్సింగ్, ప్రకాష్, డివైఎస్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ డిఈ తిరుపతి, సానిటరీ ఎస్సై నరేందర్, నాయకులు సాజిదోద్దిన్, ఇజ్జగిరి అశోక్, స్వరూపరాణి, పర్వీన్ పాల్గొన్నారు.

మంత్రి సిటీ స్కాన్ సెంటర్ సందర్శన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ సెంటర్‌ను మంగళవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జడ్పి చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు బుధవారం సిటీ స్కాన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూ.కోటీ50లక్షలతో అత్యాధునిక టెక్నాలజీ గల సిటీ స్కాన్‌ను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో మొదటి అంతస్తులో నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణాన్ని, ఆరోగ్యశ్రీ, ప్రసూతి వార్డులను పరిశీలించారు. అనంతరం జిల్లా సలహా కమిటీ సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, డీఎమ్‌హెచ్ఓ ధన్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మన ఊరు-మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన ఊరు-మన బడి కార్యక్రమం పురోగతిపై జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి మండల విద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో చేపట్టిన మూత్రశాలలు, వంటశాలలు, భోజనశాలలు, త్రాగునీరు, ప్రహరీ గోడ, విద్యుత్ ఇతరత్రా పనులను వెంటనే పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు విద్యా కమిటీ చైర్మన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపికైన పాఠశాలలలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎంపికైన సిసి రోడ్ల పనులను నిర్ణీత గడువులోగా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట(డీ) గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, సర్పంచ్ అజ్మీర తిరుపతి, నాయకులు ఏనుగు సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ అజ్మీర రాజు, హక్కు నాయక్, భీమా, రవి, రమేశ్, అజ్మీర దేవీసింగ్, దేవీలాల్, లక్ష్మణ్, దేవా, సంగ్య హీరా, పవణ్, కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

కోమటిచేను పంచాయతీ తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను గ్రామ పంచాయతీని అడిషనల్ కలెక్టర్ రాహుల్ తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఆఫీస్ రికార్డులను, నగదు పుస్తకాలను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు రికార్డులను అప్డేట్ చేయాలని సూచించారు. అన్ని రికార్డులను పూర్తిగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఎంఏ ఆలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్, కార్యదర్శి ఉదయ్ ఉన్నారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్ నగర్‌లో మహిళల కోసం ఉచిత కుట్టుమిషిన్ కేంద్రాన్ని మంగళవారం అమన్ ఫౌండేషన్ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమన్ ఫౌండేషన్ అధ్యక్షులు అర్షాద్ ఖాన్ మాట్లాడుతూ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నైపుణ్యంతో ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ శిక్షణ తరగతులు 45 రోజుల పాటు ఉంటాయని పేర్కొన్నారు. తొలి రోజు 15 మంది మహిళలు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం శుభ పరిణామమని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమన్ ఫౌండేషన్ సభ్యులు షేక్ కలీం, అజీమ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్సెస్సీ ప్రీఫైనల్

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు నేటి నుంచి మార్చి 1 వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రణీత, డీసీఈబీ కార్యదర్శి గజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 22న ప్రథమ భాష, 24న ఇంగ్లీష్, 25న గణితం, 26న సామాన్య శాస్త్రం, 28న సాంఘిక శాస్త్రం, మార్చి 1న ద్వితీయ భాష పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. విషయాన్ని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు గమనించాలని సూచించారు.

విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా నూతన కోర్సులు

- ఆర్జీయూకేటీలో అకాడమిక్ అధ్యాపకులతో సమీక్షా సమావేశం
- ఆన్‌లైన్ సర్టిఫికెట్ పోర్టల్‌ను ప్రారంభించిన వీసీ



నవతెలంగాణ-బాసర

విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన కోర్సులను ఏర్పాటు వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్జీయుకేటీ యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో యూనివర్సిటీ అధ్యాపకులతో వచ్చే అకాడమిక్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ 30వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలను, భవిష్యత్ కార్యక్రమాలను వివరించారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన కోర్సులను ఏర్పాటు, అకాడమిక్ కమిటీలు, నాణ్యమైన విద్య అందించేందుకు అధ్యాపకుల ఫీడ్ బ్యాక్ సిస్టంను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరును తప్పనిసరిగా చేయడం, సకాలంలో పరీక్షలు నిర్వహించి, త్వరితగతిన ఫలితాలు అందించడం వంటి విషయాలపై వివరించారు. 2008 నుంచి ఇప్పటివరకు విద్యార్థులు ఎవరైతే ఫెయిల్ అయి ఉన్నారో వారికి వన్ టైం చాన్స్ కింద పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించడం, అకాడమిక్ ఇయర్ 20-21వ సంవత్సరంలో చదివిన విద్యార్థులకు 40 శాతం ఫీజు రాయితీని కల్పించడం వంటి వాటిపై చర్చించారు. పీయూసీ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న విద్యార్థి ఇంజనీరింగ్ బ్రాంచ్‌ను పొందాలంటే ఖచ్చితంగా 6 సీజీపీఏను కలిగి ఉండాలని సూచించారు. త్వరలోనే విద్యార్థులకు, అధ్యాపకులకు క్యాంటీన్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించారు. అధ్యాపకుల రెన్యువల్స్ సంబంధించిన ప్రక్రియ ప్రారంభించామని అన్నారు. విద్యార్థుల భద్రతను పటిష్టపరిచేందుకు చేపట్టాల్సిన వాటిపై చర్చించినట్లు తెలిపారు. క్యాంపస్ భద్రత విషయంలో రాజీ పడబోమని అన్నారు. యూనివర్సిటీలో భద్రతను పటిష్టపరిచేందుకు చేపట్టాల్సిన చర్యల గూర్చి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని అన్నారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ పోర్టల్‌ను ప్రారంభించిన వీసీ

ఆర్జీయుకేటీ యూనివర్సిటీలో విద్యార్థుల సర్టిఫికెట్ ఆన్‌లైన్ పొందుపరిచామని ఇందుకు గాను నూతనంగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ పోర్టల్‌ను ప్రారంభించిన వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ప్రారంభించారు.ఆర్జీయుకేటీలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డ విద్యార్థుల కొరకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ సర్వీస్ పోర్టల్ ఎంతో గాను ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సర్వీస్ ద్వారా ఆర్జీయుకేటీ విద్యార్థులు ఇండియాలో ఉండి తమ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా పొందాలంటే రూ.250 పోస్టల్ చార్జీ రూపంలో చెల్లించాలని, ఇతర దేశాల్లో ఉద్యోగం చేస్తున్న విద్యార్థులకైతే రూ.2వేలు పోస్టల్ చార్జీలు చెల్లించాలని తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్ పొందుటకు సాంకేతికతను ఉపయోగిస్తూ విద్యార్థుల ఇంటికే మీ సర్టిఫికెట్ అనే పేరుతో సర్వీస్ పోర్టల్ రావడంతో విద్యార్థులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయన్నారు. ఈ సర్టిఫికెట్ పొందే విద్యార్థులు కచ్చితంగా యూనివర్సిటీకి ఎలాంటి ఫీజు బకాయిలు ఉండకూడదని తెలిపారు. ఫీజు బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికే ఈ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ పోర్టల్ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఓఈ వినోద్ అడిషనల్ సీఓఈ రామరాజు, సునీల్, ఆయా శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలోని కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు మంగళవారం కళ్యాణ లక్ష్మీ చెక్కులను మావల సర్పంచ్ దొగ్గలి ప్రమీల అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్న పలుఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బట్టి సవర్‌గాం సర్పంచ్ రాగం గంగమ్మ, మాడావి మయూరి, నాయకులు నల్ల రాజేశ్వర్, ఏవన్, చందాల రాజన్న, గోవర్ధన్ రెడ్డి, అశోక్, రాజేశ్వర్, నారాయణ, రాగం గోవర్ధన్, అజీమ్, గంగన్న, ఆసిఫ్, శ్రీనివాస్, సంతోష్, గంగన్న పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదువాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళిక ప్రకారం చదువాలని అప్పుడే ఉత్తమ మార్కులు సాధించగలరని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ షేక్ రిజ్వాన్ పాషా అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంకోలిని సందర్శించి, పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విధానాన్ని మన ఊరు మన బడి పనులు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి పలు సూచనలు చేశారు. అదేవిధంగా మన ఊరు మన బడి పనులు వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారులు కంటె నర్సయ్య, జే నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఐ, ఆర్అండ్‌బి అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎన్‌హెచ్‌ఐ, ఆర్ అండ్ బి అధికారులతో ఎమ్మెల్యే జోగు రామన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఇటీవల తరణం వంతెన పగుళ్ల తేలడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా ఆ వంతెన గుండా రాకపోకలను మూసి వేసిన సంగతి తెలిసిందే. అయితే గత 18 నెలల కిందటే జాతీయ రహదారి 353 కి.మీ నిర్మాణం కోసం ఆర్ అండ్ బీ నుండి కేంద్రం స్వాధీనంలోకి తీసుకోవడంతో ఎన్‌హెచ్ఐ అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై ఎమ్మెల్యే చర్చించారు. జాతీయ రహదారి నిర్మాణంతో పాటు వంతెన నిర్మాణ పనుల గురించి సుదీర్ఘంగా చర్చించి, అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఈ విషయంలో అధికారులకు తమ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మెన్ వ్యాఖ్యలకు ఖండన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జోగు రామన్న అనుచరులు తనపై ఆరోపణలు మానుకోవాలని బీజేపీ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి చేసిన అనుచిత, అవాస్తవ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోగు రామన్న తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జైనథ్ మండలంలోని తరోడ వంతెన దెబ్బతినడానికి, ప్రయాణికులు అవస్థలు ఎదుర్కోవడానికి ముమ్మాటికీ జోగు రామన్న వైఫల్యమేనని ధ్వజమెత్తారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒక దఫా మంత్రిగా పనిచేసిన ఆయనకు ముందుచూపులేకనే ఇవాళ ఈ దుస్థితి దాపురించిందన్నారు. తరోడ వంతెన, రోడ్డు నిర్మాణం నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి వెళ్లేందని, రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నప్పుడు నువ్వు ఏం చేశావంటూ ప్రశ్నించారు. సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొడప సోనేరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగర్కర్ శంకర్, బీజేపీ నాయకులు కిష్టారెడ్డి, బోయర్ వెంకటేష్, చిత్రు, రాజ్‌కుమార్, మారుతి, సంజీవ్, కిరణ్‌కుమార్, పూంద్రు రవికిరణ్ పాల్గొన్నారు.

టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శంషొద్దీన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శంషొద్దీన్ నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మెన్ షేక్ సోహెల్, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ మహేశ్వర్ రెడ్డి లకు శంషొద్దీన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్ షకీల్ పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్ విఠల్ మృతికి సంతాపం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ డైరెక్టర్ విఠల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం ఆయన మృతి పట్ల సొసైటీ చైర్మెన్, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్ రెడ్డి సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మృతి చాల బాధకరమని అన్నారు. సంతాపం తెలియజేసిన వారిలో సంఘ ఉపాధ్యక్షులు నల్ల పద్మాకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లోక లింగారెడ్డి, సల్ల సుధాకర్, జాదవ్ మణిరామ్, లక్ష్మీ, రేంజర్ల ఆశమ్మ, సీఈఓ శ్రీనివాస్ సంఘ సిబ్బంది, సాగర్, గంగయ్య, భీమ్‌రావు, సత్యనారాయణ, ముస్తఫా, రమాకాంత్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-లోకేశ్వరం

లోకేశ్వరం మండల కేంద్రంలోని మన్మద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వంచే ప్రవేశపెట్టబడిన ఆయుష్మాన్ భారత్ పథకానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులు తమతమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు వెంట తెచ్చుకోవాలని పంచాయతీ కార్యదర్శి మాలతి కోరారు. వారం రోజుల పాటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, పంచాయతీ సెక్రటరీ మాలతి, కారోబారి గంగాకిషన్, ఆపరేటర్ జైపాల్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పనులను బీజేపీ పనులనడం సరైంది కాదు'

తెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



బీఆర్ఎస్ పనులను బీజేపీ పనులని అనడం సరైంది కాదని జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎలక్ట్రానిక్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తే బీజేపీ నాయకులు అవి కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయని దుష్ప్రచారం చేయడం దారుణమని అన్నారు. ఇటీవల మండలంలోని కంఠ గ్రామంలో ఎమ్మెల్యే జోగు రామన్న రూ. కోటి 50లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు బీజేపీ యాత్ర సందర్భంగా ఎంపీ సోయం బాపూరావుతో తిరిగి పనులకు భూమిపూజ చేయించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీజేపీ నాయకులకు కనీస పరిజ్ఞానం లేకుండా వ్యవహరించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే సఫలీకృతమయ్యారని అన్నారు. ఆయన కేంద్రం నుండి గ్రామాల అభివృద్ధికి నిధులు తీసుకువస్తే స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఇకనైన అనవసర దుష్ప్రచారాలు మాని రాజకీయ పరిణితి కనబరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, లింగారెడ్డి, గణేష్ యాదవ్, సర్పంచ్ బాలాజీ, వెంకన్న, ఎంపీటీసీ రమేష్, కంఠ గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు ఖాతాలు ఇంటి వద్దకే

నవతెలంగాణ-భైంసా

పోస్టల్ శాఖలో పొదుపు ఖాతా ఓపెన్ చేసుకునే వారు ఫోన్ చేస్తే ఇంటి వద్దకు వచ్చి ఖాతాలు ఓపెన్ చేయడం జరుగుతుందని భైంసా డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ అన్నారు. మంగళవారం భైంసా డివిజన్ వ్యాప్తంగా పోస్టల్ శాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భైంసా, ముధోల్, బాసర సబ్ పోస్టు ఆఫీసు పరిధిలోని సిబ్బందితో సమావేశమయ్యారు. 10 సంవత్సరాలలోపు ఆడ పిల్లలకు సంబంధించి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిపించాలని సూచించారు. అలాగే రికరింగ్ డిపాజిట్ ఖాతాలు తెరిపించాలని సూచించారు. ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగే పోస్టల్ మేళాలో పెద్ద సంఖ్యలో ఖాతాలు తెరిపించాలని సిబ్బందికి సూచించారు. పోస్టు ఆఫీసులో ఖాతాలు తెరవాలనుకునే వినియోగదారులు నేరుగా బీపీఎం లకు ఫోన్ చేసినట్లయితే ఇంటికి వచ్చి ఖాతాలు తెరువడం జరుగు తుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందిస్తూ ఆయా పథకాలపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు కూడ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కూడ పోస్టల్ సేవలను పొందవచ్చని, పోస్టు ఇన్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఆయా పథకాల వివరాలు కనుక్కోవచ్చని సూచించారు. వినియోగదారులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మరిన్ని వివరాలకై దగ్గరలోని పోస్టు ఆఫీస్‌ను సంప్రదించాలని ఆన్‌లైన్‌లో సందేహాలు నివృత్తి చేసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1800 266 6868ను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ మెయిల్ ఓవర్సీర్ నరేష్, భైంసా, ముధోల్, బాసర, ఎస్పీఎంలు నర్సయ్య, బిలోలి గంగయ్య, అనుమల స్రుజన్ పోస్ట్ మెన్ గోర్లే అరుణ్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రాయపూర్ కాండ్లి గ్రామ సమీపంలో సోమవారం ఓ ఐచర్ వ్యాన్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి మండలంలోని బాగాపూర్ గ్రామంలో గల కర్బూజ లోడ్ తీసుకుని వెళ్లేందుకు ఐచర్ వ్యాన్ వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఈ ఘటనలో క్లీనర్ జుబేర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ముథోల్ ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు.